నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 26 జనవరి 2025 | HYDERABAD


## డీ-సీల్టింగ్‌కు మరో 90 రోజుల గడువు పొడిగింపు

### ఇప్పటివరకు 2,561 కి.మీ పైప్‌లైన్లు.. 2.03 లక్షల మ్యాన్‌హోళ్లు శుభ్రం

సిటీ బ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ): జలమండలి చేపట్టిన పైప్ లైన్లు, మ్యాన్ హోళ్లను శుభ్రం చేసే డీ-సీల్టింగ్ పనులకు మరో 90 రోజుల గడువు పొడిగించినట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ తెలిపారు. ఈమేరకు వ్యర్థాల తొలగింపు పనులు వేగవంతంగా చేపడుతున్న అధికారులు, సిబ్బందిని వారు శనివారం అభినందించారు. ఇప్పటి వరకు నగర వ్యాప్తంగా 2,561 కిలోమీటర్ల పైప్ లైన్లు, 2.03 లక్షల మ్యాన్ హోళ్లను శుభ్రం చేశామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని అన్ని పైప్‌లైన్లు, మ్యాన్ హోళ్లను శుభ్రం చేసేందుకు డీ-సీల్టింగ్ పనులను గతేడాది అక్టోబర్ 2న ప్రారంభించారు.90 రోజుల్లో మంచి ఫలితాలు రావడంతో వ్యర్థాలు తొలగించడానికి గడువును మరో 90 రోజులు పొడిగించారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ-హైదరాబాద్ పేరిట చేపట్టిన వ్యర్థాల తొలగింపు పనులను మరింత వేగవంతం చేయాలని జలమండలి ఎండీ, ఈడీ అధికారులు, సిబ్బందికి సూచించారు. పనుల పురోగతిపై సంబంధిత సీజీఎంలు, డైరెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు



కాకర్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్యులు

## కాకర్ల సేవలు వెలకట్టలేనివి..

ఖైరతాబాద్: నిమ్స్ దవాఖానలో కాకర్ల సుబ్బారావు అందించిన సేవలు వెలకట్టలేనివని పలువురు వైద్య నిపుణులు అన్నారు. నిమ్స్ మాజీ డైరెక్టర్ దివంగత కాకర్ల సుబ్బారావు శత జయంతి వేడుకలు రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ, నిమ్స్ డైరెక్టర్‌గా కాకర్ల సుబ్బారావు 1985 నుంచి 1991, 1997 నుంచి 2004 వరకు కొనసాగారన్నారు. నిమ్స్ దేశంలోనే గొప్ప ఆస్పత్రిగా రూపొందడంలో కాకర్ల ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం నిమ్స్‌లో కాకర్ల విగ్రహాన్ని ప్రతిష్టించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్ అకాడమిక్ డైరెక్టర్ దామోదర నాయుడు, డాక్టర్ మార్త రమేశ్, ప్రజా సంబంధాల అధికారి సత్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉట్టి మీద వందల కోట్లు..!

**మున్సిపాల్టీ, కార్పొరేషన్ల పాలకవర్గాలకు సర్కారు ఝలక్**

**స్టాంపు డ్యూటీ కింద స్థానిక సంస్థలకు నిధులు మంజూరు**

**అభివృద్ధి పనుల బిల్లులకు మళ్లించేందుకు పాలకవర్గాల స్కెచ్**

**జీతభత్యాల కోసమే వినియోగించాలంటూ సీడీఎంఏ ఉత్తర్వులు జారీ**



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 25 (నమస్తే తెలంగాణ): ఉట్టికి కోడిని కట్టి కూరలేని అన్నం తింటూ.. చికెన్ పలావు తిన్నట్లుగా ఊహించుకోండి! అని అంటే ఎలా ఉంటుంది? ఆదివారంతో గడువు ముగియనున్న పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాలకు తాజాగా ఇదే పరిస్థితి ఎదురైంది. ఎందుకంటే పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాలకు చివరి దశలో రాష్ట్ర సర్కారు ఝలక్ ఇచ్చింది. ఆయా స్థానిక సంస్థల ఖజానాకు నిధులు మంజూరు చేసినప్పటికీ అభివృద్ధి, ఇతర పనుల కోసం వినియోగించడంపై మాత్రం ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. దీంతో ఖజానాలో భారీ నిధులున్నా.. చివరి నిమిషంలో వాడుకునేందుకు అవకాశం లేకపోవడంతో పాలకవర్గాలు నీరుగారిపోయాయి. కొన్ని కార్పొరేషన్లలోనైతే ఏకంగా ఈ నిధుల మీద ఆశతో ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశాలు నిర్వహించి మరీ హడావిడిగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు తీర్మానం కూడా చేసుకున్నారు. తీరా... అధికారులతో ఖజానాపై వాకబు చేయించుకుంటే ఆ నిధులను ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయ నిర్వహణ కోసం మాత్రమే వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇంకేముంది... ఉట్టి మీద కోట్ల రూపాయలున్నా.. బిల్లులకు మోక్షం కలగకపాయె! అని పాలకవర్గాలు చిన్నబుచ్చుకున్నాయి.

### ఖజానాలో చిల్లిగవ్వ లేకున్నా..

ప్రజాప్రతినిధులంటే పదవీ కాలం ఐదేండ్లు. మరి పదవీ కాలం ముగుస్తుందనుకుంటున్న తరుణంలో ఆయా ప్రజాప్రతినిధులు సాధ్యమైనంత మేర ఎక్కువ అభివృద్ధి పనులు చేసుకోవాలని చూస్తారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధుల్లోనైతే సర్వసభ్య సమావేశాలు జరిగిన ప్రతిసారీ ఈ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు కోట్లల్లో పారుతాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గం పదవీకాలం ఆదివారంతో ముగుస్తుంది. అందుకే గత కొన్ని రోజులుగా నగర శివారుల్లోని కార్పొరేషన్లలోని పాలకవర్గాలు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు తీర్మానం చేశాయి. గతంలోని పనులకు చకచకా బిల్లుల చెల్లింపు ప్రక్రియ ముగిసేలా జాగ్రత్తపడ్డాయి. ఇలా చాలా కార్పొరేషన్లలో ఖజానాలో నిధులు లేకున్నా.. కోట్లాది రూపాయల ప్రతిపాదనలకు తీర్మానాలు చేసుకొని హడావిడిగా ప్రారంభోత్సవాలు చేశారు. అయితే గత కొన్ని రోజుల కిందట ఊహించనిరీతిలో ఈ కార్పొరేషన్లకు ఒక్కసారిగా నిధులు వచ్చిపడటంతో పాలకవర్గాల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా స్టాంపు, రిజిస్ట్రేషన్ శాఖపరంగా జరిగే భూ క్రయ, విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం వసూలు చేసే స్టాంప్ డ్యూటీలో 0.5 శాతం ఆయా స్థానిక సంస్థలకు వెళ్తుంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు కాకుండా తరచూ ఒకేసారి ఈ మొత్తాన్ని ఆయా స్థానిక సంస్థలకు విడుదల చేస్తుంది. ఇందులో భాగంగా ఈ నెల7న రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలకు స్టాంపు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి సుంకం కింద ప్రభుత్వం రూ.2,694.75 కోట్లు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీటిల్లో భాగంగా నగరం చుట్టూ ఉన్న కీలకమైన నిజాంపేట, బడంగ్‌పేట, మీర్‌పేట, బండ్లగూడ, పీర్జాదిగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్ వంటి ఏడు కార్పొరేషన్లకు సుమారు రూ.460 కోట్ల వరకు నిధులు బదిలీ అయ్యాయి. దీంతో ఆయా పాలకవర్గాల్లో ఒక్కసారిగా ఆశలు చిగురించాయి. ఆదివారంతో పదవీకాలం ముగుస్తున్నందున చాలాచోట్ల కొన్ని రోజులకు ముందే సర్వసభ్య సమావేశాలు నిర్వహించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు తీర్మానం చేసుకున్నారు. ఖజానాలో చిల్లిగవ్వ లేకున్నా సరే.. రూ.30-40 కోట్లకు తీర్మానాలు జరిగిన కార్పొరేషన్లు కూడా ఉన్నాయి. బడంగ్‌పేట కార్పొరేషన్ పాలకవర్గం ఒకడుగు ముందుకేసి రెండు రోజుల కిందట కూడా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి కోట్లాది రూపాయల ప్రతిపాదనలకు తీర్మానం చేసుకోవడం కొసమెరుపు.

### గల్లంతైన నిధుల డ్రా ఆశలు..

స్టాంప్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి సుంకం కింద బదిలీ అయిన నిధులతో కొన్ని కొత్త అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు మోక్షం కల్పించుకోవడంతో పాటు పెండింగ్ బిల్లులను పెద్ద ఎత్తున మంజూరు చేయించుకునేందుకు పాలకవర్గాలు భారీ ఎత్తున పావులు కదిపాయి. నగరం చుట్టూ ఉన్న ఏడు కార్పొరేషన్లనే తీసుకుంటే.. బడంగ్‌పేట-రూ.89.87 కోట్లు, బండ్లగూడ-రూ.96.73 కోట్లు, బోడుప్పల్-రూ.45.07 కోట్లు, పీర్జాదిగూడ-రూ.40.38 కోట్లు, మీర్‌పేట-రూ.17.74 కోట్లు, జవహర్‌నగర్-1.50 కోట్లు, నిజాంపేట-169 కోట్లు నిధులు బదిలీ అయ్యాయి. ఎలాగూ ఇంత భారీమొత్తంలో నిధులు వచ్చినందున బిల్లులను డ్రా చేసుకునేందుకు ప్రజాప్రతినిధులు విశ్వ ప్రయత్నం చేశారు. కానీ ఈ పరిణామాన్ని సర్కారు ముందుగానే ఊహించింది. అందుకే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించింది. ఈ నిధుల నుంచి ఒక్క పైసా కూడా అభివృద్ధి పనులకు విడుదల చేయవద్దని, వాటికి తర్వాత నిధులు ఇస్తామని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిధులను కేవలం ఉద్యోగుల జీతభత్యాలు, ఉద్యోగుల పెండింగ్ ఈఎస్ఐ, ఈపీఎఫ్, సీసీ చార్జీల చెల్లింపు, జీఎస్టీ, ఐటీ వంటి చెల్లింపులకు మాత్రమే వినియోగించాలని చావుకబురు చల్లగా చెప్పారు. దీంతో పాలకవర్గాల గొంతులో వెలక్కాయపడిన పరిస్థితి. ఇక్కడే కాదు రాష్ట్రవ్యాప్తంగానూ పట్టణ స్థానిక సంస్థల పరిస్థితి ఇలానే ఉన్నప్పటికీ.. నగరానికి ఆనుకొని ఉన్న కార్పొరేషన్లు అయినందున ఇక్కడ భారీ మొత్తంలో నిధులు ఉన్నా చివరి నిమిషంలో వాటిని వాడుకోలేని విషమ పరిస్థితిలో పాలకవర్గాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.

## బతికున్న అత్తను చంపేసింది..

**జీవించి ఉండగానే డెత్ సర్టిఫికెట్**

**ఇంటిని తీసుకుని.. బయటకు పంపించిన కోడలు**

**అనాథాశ్రమంలో వృద్ధురాలు**

**ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు**

**న్యాయం చేయాలని నెలరోజులుగా ఠాణా చుట్టూ ప్రదక్షిణలు**



చాయాదేవి

మణికొండ, జనవరి 25 : అత్తామామలు సంపాదించిన ఆస్తులు తీసుకొని ఓ కోడలు.. బతికి ఉన్న అత్త చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించి.. ఆమెను అనాథాశ్రమానికి పంపించింది. అయితే.. తమ కోడలు వేధిస్తుందంటూ బాధిత వృద్ధురాలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే వారు పట్టించుకోకపోవడంతో నెలరోజులపాటు ఠాణా చుట్టూ తిరుగుతూనే ఉన్నది. వివరాల్లోకి వెళ్తే.. మణికొండ మున్సిపాలిటీ, అల్కాపూర్ టౌన్‌షిప్‌లో చాయాదేవి(70)..భర్త రామకృష్ణ, కుమారుడు శివప్రసాద్, కోడలు మాధవి, మనవడు ప్రణవ్‌లతో కలిసి నివాసముండేది. రెండేళ్ల కిందట భర్త, కొడుకు అనారోగ్య కారణాలతో మృతిచెందారు. మనవడు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లిపోయాడు. కోడలు మాధవితో కలిసి చాయాదేవి ఫ్లాట్‌లో ఉంటున్నారు. కోడలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. కాగా.. కోడలు మాధవి కొన్నిరోజుల కిందట మరోవ్యక్తిని వివాహం చేసుకుని అదే ఇంట్లో కాపురం పెట్టింది. అప్పటి నుంచి అత్తను బయటకు పంపాలని వేధింపులకు గురిచేస్తున్నది. ఈ క్రమంలో అత్తను ఆమె ఇద్దరు కూతుళ్ల వద్ద ఉండాలని పంపించి.. ఆమె చనిపోయినట్టు డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించింది. కొన్నాళ్లు తన ఇద్దరు కూతుళ్ల వద్ద ఉండి.. మనస్సు నచ్చక వృద్ధాశ్రమంలో ఉంటున్నట్లు బాధితురాలు చాయాదేవి వాపోతున్నది. తన భర్త సంపాదించిన ఫ్లాటును కోడలు ఆక్రమించుకుని.. దానిపై రూ.40 లక్షల బ్యాంకు రుణాన్ని సైతం తీసుకుని.. తనను బయటకు పంపించిందని.. న్యాయం చేయాలని నెల రోజుల కిందట నార్సింగి పోలీసులను ఆశ్రమియిస్తే..విచారణ పేరిట పట్టించుకోవడంలేదంటూ.. శనివారం ఏసీపీ ఏసీపీ రమణాగౌడ్‌ను కలిసి న్యాయం చేయాలని వేడుకున్నది. కూతురు కొడుకులతో ఇంటికి వెళ్తే కోడలు అక్రమ కేసులు బనాయించి భయాందోళనలకు గురిచేస్తుందని వాపోయింది.

### చర్యలు తీసుకుంటాం: ఏసీపీ

చాయాదేవికి జరిగిన అన్యాయంపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని నార్సింగి పోలీసులను ఆదేశించినట్లు ఏసీపీ రమణాగౌడ్ తెలిపారు. బతికున్న వారిని చనిపోయినట్లుగా చిత్రీకరించి.. ఆపై తనపైనే దాడిచేశారంటూ తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేలితే చట్టపరమైన కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. వృద్ధురాలి ఆవేదనపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించానని తెలిపారు.



భాగ్యనగరం త్రివర్ణ శోభితమైంది. గణతంత్ర వేడుకలకు ఘనంగా ముస్తాబైంది. నగరంలోని పలు ప్రముఖ భవనాలు, దర్శనీయ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి త్రివర్ణ కాంతుల్లో దేదీప్యమానంగా వెలిగిపోతున్న అసెంబ్లీని చిత్రంలో చూడచ్చు.

## తలనొప్పిగా అపార్

**ఈనెల 31 వరకు వివరాలు ఇవ్వాలని స్కూళ్లకు ఆదేశాలు**

**ఆధార్, జనన ధ్రువీకరణలో తప్పులు.. ఆందోళనలో తల్లిదండ్రులు**

సిటీబ్యూరో, జనవరి 25 ( నమస్తే తెలంగాణ ) : ఒకే దేశం.. ఒకే ఐడీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్( ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) జారీ ప్రక్రియ హైదరాబాద్ జిల్లాలో నత్తనడకన సాగుతున్నది. ఈనెల 31 వరకు వివరాలు అందించాలని విద్యాశాఖ ఇప్పటికే స్కూళ్లకు ఆదేశాలు జారీ చేసింది. కానీ అపార్ నమోదులో టీచర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల పేర్లు పాఠశాల రికార్డుల్లో ఒక విధంగా ఆధార్ కార్డుల్లో మరో విధంగా ఉంటే వెబ్‌సైట్ వాటిని తీసుకోవట్లేదు. దానిని పరిష్కరించేందుకు టీచర్లు జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని కోరుతున్నారు. అందులో ఏవైనా తేడాలుంటే ఐడీ క్రియేట్ చేయడం సాధ్యం కావట్లేదు. ఆధార్ తీసుకునే సమయంలో చాలా తప్పులు దొర్లుతున్నాయి. పుట్టిన తేదీల్లోనూ తప్పులను నమోదు చేశారు. ఇప్పుడు వాటిని సరిదిద్దడం స్కూలు యాజమాన్యాలకు తలకు మించిన భారంగా మారింది. హైదరాబాద్‌లో 3122 స్కూళ్లు ఉన్నాయి. 10,10,550 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే 2.66 లక్షల విద్యార్థులకు మాత్రమే అపార్ ఐడీ జనరేట్ అయినట్టు అధికారులు తెలిపారు. చాలా స్కూళ్లకు ఇప్పటికీ అపార్ ప్రక్రియనే మొదలుపెట్టలేదు. దీంతో ఇప్పడు ఈనెల 31 వరకు గడువు సమీపిస్తుండటంతో ప్రైవేటు పాఠశాలలు, సర్కారీ స్కూళ్ల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం పంపించారు. అపార్ ఐడీకి సంబంధించిన ఆధార్, డిక్లరేషన్ ఫారం ఇవ్వాలని సూచించారు. అయితే ఇప్పుడు తమ పిల్లల ఆధార్ కార్డుల్లో, స్కూల్ రిజిస్టర్‌లో ఉన్న పేర్ల మధ్య వ్యత్యాసాలు ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల పేర్లల్లో మార్పులు, చేర్పులు ఉంటే డిప్యూటీ ఐఓఎస్ ఆధ్వర్యంలో చేయనున్నారు. అయితే ఈ ప్రక్రియ కాస్త ఆలస్యంగా సాగనున్నది. సరైన సమాచారం ఇస్తేనే విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్ అవుతుందని అధికారులు తెలిపారు. ఏమైన మార్పులు, చేర్పులు ఉంటే ఐడీ జనరేట్ కాదని, తర్వాత పరిశీలిస్తామని వివరించారు. కాగా, జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అపార్ ఐడీ తీసుకొచ్చింది. అపార్ కార్డుపై 17 అంకెల యూనిక్ నంబర్‌తో పాటు క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఇందులో విద్యార్థికి సంబంధించిన సంక్షిప్త సమాచారం ఉంటుంది. ప్రతి విద్యార్థి యొక్క పూర్తి సమాచారం డిజిటల్ రూపంలో అపార్ కార్డులో సేవ్ చేయబడుతుంది. విద్యా నాణ్యతతో పాటు క్రీడా నైపుణ్యాలను కూడా నమోదు చేస్తారు. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారే క్రమంలో ఈ అపార్ కార్డు ఉపయోగపడుతుంది. వివిధ పాఠశాలల్లో అడ్మిషన్ల నుంచి ఉద్యోగాల పొందే వరకు అపార్ కార్డు కేంద్రంగానే సాగుతుందని అధికారులు తెలిపారు.

## అంతా అయోమయం..

**లబ్ధిదారుల ఎంపికపై గందరగోళం**

మేడ్చల్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): నాలుగు గ్యారంటీల అమల్లో లబ్ధిదారుల ఎంపిక అయోమయంగా మారింది. మేడ్చల్ జిల్లాలో నాలుగు రోజుల పాటు జరిగిన గ్రామ, వార్డు సభల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను మాత్రమే చదివి వినిపించామని అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం పథకాలను అందించేలా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని ప్రభుత్వ ప్రకటనతో అంతా అయోమయం.. గందరగోళమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. నేడు నాలుగు గ్యారంటీల పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కసరత్తు చేస్తున్న క్రమంలో లబ్ధిదారుల ఎంపికను ఏ ప్రతిపాదికన చేస్తారన్నది అర్థం కావడం లేదు. లబ్ధిదారుల ఎంపిక జాబితా నేడు సాయంత్రం తేలిపోనున్నది. జాబితాలో పేర్లు రాని వారం దరూ మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు మళ్లీ దరఖాస్తులను ప్రజలు చేసుకోవాల్సి వచ్చింది. అయితే గ్రామ, వార్డు సభల్లో ప్రకటించిన జాబితా కేవలం దరఖాస్తుదారులదేనని స్పష్టం చేసిన అధికారులు.. ఎలాంటి సర్వే చేయకుండా లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుందో దరఖాస్తుదారులకు అర్థం కావడం లేదు. లబ్ధిదారుల ఎంపికపై రీ సర్వే చేయాలని వస్తున్న డిమాండ్ల మేరకు అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే. కాగా, జిల్లాలో జరిగిన గ్రామ, వార్డు సభల్లో జీహెచ్ఎంసీ పరిధిలోనివి కాకుండానే 62,144 దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలో జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధితో పాటు మున్సిపాలిటీలు, గ్రామాల్లో రేషన్ కార్డులను సంబంధించి 1.22 లక్షలు, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి 1.44 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గ్రామ, వార్డు సభల్లో రేషన్ కార్డుల కోసం 33,435, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి 27,086, రైతు భరోసాకు 378, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 1,245 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాబురావు

## చర్చిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఖైరతాబాద్, జనవరి 25 : ముషీరాబాద్‌లోని హెబ్రాన్ చర్చిపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని రెవరెండ్ జోయల్ జాన్ స్టీవార్డ్ రిచర్డ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాబురావుతో కలిసి మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 31న ముషీరాబాద్‌లోని హెబ్రాన్ చర్చిపై వంద మంది గుండాలు దాడి చేయడంతో పాటు చర్చి నిర్వాహకులను కొట్టారన్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావుకు సైతం గాయాలయ్యాయన్నారు. ఈ క్రమంలో సీసీ ఫుటేజీలు, డీవీఆర్‌లను ధ్వంసం చేశారన్నారు. కొందరు ఫేక్ సొసైటీ ట్రస్ట్ పేరుతో చర్చికి సంబంధించిన కోట్లాది రూపాయలను దోచుకున్నారని చెప్పారు. వీరాచారి అతని అనుచరులే ఈ దాడుల వెనుక ఉన్నారని, ఇప్పటికే వారిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎడ్వార్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.


